ఎల్లమ్మ సిద్ధోగానికి కేటీఆర్‌కు ఆహ్వానం

కేటీఆర్‌ను కలిసి ఆహ్వానిస్తున్న పెద్దూరు నేతలు, గౌడ సంఘ సభ్యులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 18: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరులో జరిగే ఎల్లమ్మ సిద్ధోగ వేడుకలకు రావాలని మాజీ మంత్రి కేటీఆర్‌ను పెద్దూరు గౌడ సంఘ నేతలు, సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో స్వయంగా కేటీఆర్‌ను కలిసి ఆహ్వానించారు. సానుకూలంగా స్పందించిన కేటీఆర్, వేడుకలకు హాజరవుతానని తెలిపినట్లు వారు పేర్కొన్నారు. కలిసిన వారిలో కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, ఆదిపెల్లి దేవగౌడ్, విడుగురాళ్ల బాలరాజు, నారాయణ గౌడ్, దేవయ్య, గౌడ సంఘ నేతలు ఉన్నారు.

క్రికెట్ జట్టు విజేత ఫాజుల్‌నగర్

ఎల్లారెడ్డిపేటలో నగదు బహుమతిని అందుకుంటున్న విన్నర్స్ టీం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 18: తుర్కాశీ రాష్ట్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ పోటీల్లో వేములవాడ మండలం ఫాజుల్ నగర్ జట్టు విజయం సాధించినట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ షరీఫ్ తెలిపారు. వీర్నపల్లి, రాళ్లపేట, పెద్దూర్, పల్లె నిజామాబాద్, ఫాజుల్ నగర్, ఇస్లాం నగర్ జట్లు పోటీల్లో పాల్గొనగా ఫైనల్లో రాళ్లపేట-ఫాజుల్‌నగర్ జట్లు తలపడ్డాయి. ఇందులో రాళ్లపేటపై ఫాజుల్‌నగర్ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ జట్టుకు రూ.4 వేల నగదు బహుమతిని అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ తుర్కాశీ సంఘం లీగల్ అడ్వైజర్ యామిన్ భాషా, సంఘ నాయకులు సయ్యద్ ఉమర్ ఖాసీం, లాల్ మహ్మద్, సయ్యద్ మహ్మద్, ముఖీం, సాబీర్, రషీద్ ఉన్నారు.

సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ



ఎల్లారెడ్డిపేటలో గౌడ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గోవర్ధన్ గౌడ్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 18: మండల కేంద్రంలో గౌడ సంఘ భవన నిర్మాణానికి సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ గురువారం భూమిపూజ చేశారు. రూ.11 లక్షల విలువైన భూమితో పాటు తనవంతుగా రూ.5 లక్షలు నిర్మాణానికి అందించారు. ఇక్కడ సంఘం మండలాధ్యక్షుడు గంట కార్తిక్ గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్, కోల నారాయణగౌడ్ తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Bojja Gattu Jyothi, D/o Kudukala Kishtaiah @ Kuduka Kishtaiah, W/o. Bojja Gattu Mohan H.No. 3-37, Ashireddypally, Chandurthy, Rajanna Sircilla. my Name and husband Name as changed as Gattu Jyothi W/o Gattu Mohan.
NTK-311280

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

అభివృద్ధి సాధకుడిని గెలిపించండి

- డాక్టర్ బోయినిపల్లి మాధవి, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు
- బోయినపల్లి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఉపాధి కూలీలకు అభ్యర్థన



మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న డాక్టర్ బోయినిపల్లి మాధవి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 18 : అధికారం లేకున్నా ప్రజలతో ఉంటూ నిరంతరం అభివృద్ధే ప్రధాన కర్తవ్యంగా పనిచేసిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను కరీంనగర్ ఎంపీగా గెలిపించాలని ఆయన సతీమణి డాక్టర్ మాధవి కోరారు. గురువారం మండల కేంద్రంతోపాటు గాలిపెల్లి, అనంతగిరి, తాళ్లపెల్లి, తిప్పాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి కూలీలను కలిశారు. ఎంపీగా బోయినపల్లి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కరీంనగర్ ఎంపీగా గతంలో వినోద్ కుమార్ చేసిన సేవలను ప్రజలు ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. 2019 ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ని ప్రజలు గెలిపించినా ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. అభివృద్ధిని మరిచిపోయిన బీజేపీ, అబద్ధాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలను విస్మరించిందన్నారు. గత ఎన్నికల్లో ఓటమి పాలైనా ప్రజలతో మమేకమై ఉంటూ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌కు ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహా రెడ్డి, నాయకులు మీసరగండ్ల అనిల్, సాదుల్, విజయ్, దేవారెడ్డి, శ్రీనివాస్, సత్తిరెడ్డి, లక్ష్మణ్, వెంకటరాం రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాజు

చందుర్తి, ఏప్రిల్ 18 : చందుర్తి మండలం మల్యాల గ్రామంలో క్రీడాకారులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఈర్లపల్లి రాజు గురువారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈర్లపల్లి రాజు మాట్లాడుతూ, గ్రామీణ యువత, క్రీడాకారులు వేసవి కాలంలో చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేసిందని తెలిపారు. ఇక్కడ నాయకులు, క్రీడాకారులు ఉన్నారు.

నాంపల్లి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 18: వేములవాడ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును నాంపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేయాలని రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేములవాడ, బోయినపల్లి మార్కెట్ కమిటీ ఆదాయం పెరగాలంటే తిప్పాపూర్ వద్ద ఉన్న చెక్‌పోస్టును నాంపెల్లి చౌరస్తా, బోయినపల్లి మార్కెట్ కమిటీ కొదురుపాక, నర్సింగపూర్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తే ప్రైవేటు వ్యాపారుల నుంచి పన్ను వసూలు చేయవచ్చన్నారు. ప్రైవేటు వ్యాపారులు మార్కెట్ ఆదాయానికి గండికొట్టే ప్రయత్నం చేస్తున్నారని, వెంటనే మార్కెట్ కార్యదర్శి చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు వెంట ఉంచుకోవాలి

- జిల్లా విద్యాధికారి సుమన్ మోహన్‌రావు
- గర్జనపల్లి సబ్ సెంటర్ ఆకస్మిక తనిఖీ

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు

వీర్నపల్లి, ఏప్రిల్18 : వేసవి దృష్ట్యా వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లు వెంట ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని గర్జనపల్లి ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్‌ను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సబ్ సెంటర్‌లో ధ్వంసమైన విద్యుత్ సామగ్రి, పగిలిన బీరు సీసాలను పరిశీలించారు. హెల్త్ సబ్ సెంటర్‌లో మెరుగైన సేవలు అందిస్తున్నప్పటికీ ఆకతాయిలు ఇలాంటి చర్యలు పాల్పడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆకతాయిలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కలెక్టర్, ఎస్పీ దృష్టికి ఇక్కడి సమస్య విన్నవిస్తానని తెలిపారు. ఆయన వెంట ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై దాడి చేసిన ఒకరి అరెస్ట్

రుద్రంగి, ఏప్రిల్ 18: రుద్రంగి అటవీ ప్రాంతంలో మార్చి 18న గస్తీ నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులపై దాడి చేసిన సంతోష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు. రుద్రంగి మండలం అడ్డబోరు తండా గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు మంగళవారం గస్తీ నిర్వహించారు. రాత్రి 7 గంటల సమయంలో అడ్డబోరు తండాకు చెందిన సంతోష్ బీట్ ఆఫీసర్ల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు రాళ్లతో దాడి చేశాడు. దీంతో బీట్ ఆఫీసర్ బాలకృష్ణ, రాజుకు గాయాలయ్యాయి. బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతోష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వడదెబ్బతో ఒకరి మృతి

చందుర్తి, ఏప్రిల్ 18 : చందుర్తి మండలం రామారావుపల్లిలో వడదెబ్బతో ఒకరు మృతి చెందారు. గ్రామస్తుల కథనం ప్రకారం, రామారావుపల్లికి చెందిన మట్కం

గంగారం (ఫైల్)

గంగారం (42) గురువారం చందుర్తిలో పనిపై ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి గ్రామ శివారులోని మామిడి తోట వద్దకు చేరుకొని విశ్రాంతి తీసుకుంటుండగా అస్వస్థతకు గురయ్యాడు. అక్కడే ఉన్న కొందరు వెంటనే ద్విచక్ర వాహనంపై గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గంగారానికి భార్య సరోజన, కూతురు, కుమారుడు ఉన్నారు. పేదకుటుంబం కావడంతో గ్రామస్తులు అంత్యక్రియల కోసం విరాళాలు సేకరించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పసుపు క్వింటాల్ ధర రూ.15,016

మెట్‌పల్లి, ఏప్రిల్ 18: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం పసుపు కాడి రకానికి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 15,016 ధర పలికింది. కనిష్ఠంగా రూ. 13,251, పసుపు గోళకు గరిష్ఠంగా రూ. 14,051, కనిష్ఠంగా రూ.13,716, పసుపు చూరకు గరిష్ఠంగా రూ. 13,628 కనిష్ఠంగా రూ.12,009 వేలు ధర పలికింది. ఇప్పటి వరకు మార్కెట్‌లో 27,603 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

సంక్షేమ వసతి గృహాల తనిఖీ

చందుర్తి : సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న జిల్లా షెడ్యూల్డ్ కులాల సహాయ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి

చందుర్తి, ఏప్రిల్ 18: మండల కేంద్రంలో అద్దె భవనంలో కొనసాగుతున్న సంక్షేమ వసతి గృహాన్ని గురువారం జిల్లా షెడ్యూల్డ్ కులాల సహాయ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి తనిఖీ చేశారు. చందుర్తి మండల కేంద్రంలో పురాతన అద్దె భవనంలో ఉన్న సంక్షేమ వసతి గృహాన్ని మరో అద్దె భవనంలోకి మార్చేందుకు పరిశీలించారు. అలాగే లింగంపేట గ్రామానికి చెందిన పురుగుల ప్రశాంత్ విదేశీ విద్యకు ఇరవై లక్షల ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోగా జిల్లా అధికారి విజయలక్ష్మి సర్టిఫికెట్లను పరిశీలించారు. ఇక్కడ వార్డెన్ రవీంద్రస్వామి ఉన్నారు.

రుద్రంగి, ఏప్రిల్ 18: విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సహాయ అధికారి విజయలక్ష్మి అన్నారు. రుద్రంగి సంక్షేమ వసతి గృహాన్ని గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులు పట్టుదలతో చదివి సన్మార్గంలో పయనించాలని సూచించారు. సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ రవీంద్ర స్వామి తదితరులు ఉన్నారు.

రూ. 24.80 లక్షల మద్యం స్వాధీనం

జగిత్యాల, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటి వరకు రూ. 24,80,945 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి సత్యనారాయణ తెలిపారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ 17 వరకు 105 గుడుంబా కేసులు నమోదు చేసి 17మందిని అరెస్ట్ చేశామన్నారు. 350 లీటర్ల గుడుంబా, 21320 లీటర్ల బెల్లం పానకాన్ని పట్టుకున్నామని వెల్లడించారు. ఈ నేరాలకు ఉపయోగించిన ఏడు వాహనాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. గుడుంబా తయారీ, సరఫరా, రవాణా, గంజాయి, అక్రమ మద్యం, అనధికార మద్యం దుకాణాల నిర్వహణ తదితర నేరాల నియంత్రణకు ఎక్సైజ్ శాఖలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం, జిల్లా టాస్క్ ఫోర్స్, స్టేషన్ సిబ్బంది రెవెన్యూ, పోలీసు శాఖ సిబ్బంది సమన్వయంతో దాడులు చేస్తున్నాయని చెప్పారు. ఎక్సైజ్ నేరాల ఫిర్యాదుల కోసం జిల్లా ఎక్సైజ్ కార్యాలయ కంట్రోల్ రూం 8019108768, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ 8712658823, జగిత్యాల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 8712658824, ధర్మపురి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 8712658825, మెట్‌పల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 8712658826 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

ముస్తాబాద్‌లో ఇంటిపన్ను వసూళ్లలో గోల్‌మాల్

ముస్తాబాద్, ఏప్రిల్ 18: ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీలో ఇంటి పన్ను వసూళ్లలో గోల్‌మాల్ జరుగుతున్నది. ప్రజల నుంచి పెండింగ్ బిల్లు పూర్తిగా వసూలు చేసి జీపీకి మాత్రం ఒక ఏడాది పన్ను మాత్రమే చెల్లిస్తున్న వ్యవహారం గురువారం ఆలస్యంగా బయటపడింది. వివరాల్లోకి వెళితే.. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి నుంచి ఇంటి పన్నును గత ఫిబ్రవరి 21న గ్రామ పంచాయతీ సిబ్బంది వసూలు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,323, 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1389 అంటే మొత్తం రూ.2,712 వసూలు చేసి రసీదు ఇచ్చారు. అయితే తన ఇంటి పక్కవారికి పన్ను తక్కువగా వచ్చిందని ఇటీవలే తెలుసుకున్న సదరు వ్యక్తి, గురువారం జీపీకి వచ్చాడు. పంచాయతీ ఇన్‌చార్జి ఈవో రాజును ప్రశ్నించగా, రికార్డులు పరిశీలించారు. అయితే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.1389 మాత్రమే చెల్లించినట్లు ఉండడంతో సదరు వ్యక్తి కంగుతిన్నాడు. తన వద్ద రెండేండ్ల బిల్లు వసూలు చేసి రసీదు ఇచ్చారని, కానీ పంచాయతీలో ఒకే ఏడాది చెల్లించినట్లు ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. గతంలోనూ నకిలీ రసీదుల వ్యవహారం బయటపడగా, అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకోవడం వల్లే మళీ పునరావృతమవుతున్నాయని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పన్నుల వసూళ్లు, ఇంటి పర్మిషన్లలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే ఈ విషయమై గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి ఈవో రాజును వివరణ కోరగా, గ్రామ పంచాయతీ రసీదు బుక్‌లో రూ.1389 చెల్లించినట్లు మాత్రమే ఉందని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

విద్యార్థి కుటుంబానికి పరిహారమివ్వాలి

- బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్

తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్

సిరిసిల్లటౌన్, ఏప్రిల్ 18: గురుకులంలో ఫుడ్ పాయిజన్ కారణంగా మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం అందించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జబ్బిక్‌పల్లి గ్రామానికి విద్యార్థి సాంఘిక సంక్షేమ పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ కారణంగా తీవ్ర అస్వస్థతకు గురై ఐదు రోజుల పాటు చికిత్స పొందుతూ తుది శ్వాసవిడిచాడని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 24 మంది విద్యార్థులు దవాఖానలో చికిత్స పొందుతున్నారన్నారు. మరణించిన విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం పరిహారం అందించాలని, విద్యార్థులకు నాణ్యమైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేశ్, బైరగోని హర్షిత్, కోడం నరేశ్, వసీం అక్రం, సమీ, సుదీప్, వంశీ,నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

వేములవాడలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వేములవాడ, ఏప్రిల్ 18: వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద ఓటు హక్కు వినియోగంపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు తమ పాటల ద్వారా ఓటు వినియోగంపై పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఓటు హక్కు మన అందరి హక్కు అని, రాజ్యాంగం ద్వారా కల్పించిన ఈ హక్కును భారతదేశ పౌరులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓటర్లు విధిగా తమ ఓటు హక్కు వినియోగంచుకోవాలని ఆటపాటల ద్వారా కళా ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి టీమ్ లీడర్ పొత్తూరి రాజు, కళాకారులు గడ్డం దేవయ్య, పుడూరి సంజీవ్, అంతడపుల జాన్సీ, లావణ్య, కిన్నెర శ్రీలత, అనుముల శిరీషతోపాటు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మల్కపేటలో శ్రీ సీతారామచంద్ర స్వామి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనరసింహా రావు, కుటుంబ సభ్యులు

కోనరావుపేట, ఏప్రిల్ 18 : మండలంలోని మల్కపేట రిజర్వాయర్ కట్టపై చల్మెడ కుటుంబ సభ్యులు నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి బృందం నిత్య హోమాలను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో చల్మెడ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

సర్కారు బడుల్లోనే చేర్పించాలి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 18: ఉపాధ్యాయులు తల్లిదండ్రులను చైతన్యం చేసి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం డీఈవో ఆఫీసులో వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెంపునకు జడ్పీహెచ్ఎస్ వెల్గొండ, ఎంపీపీఎస్ వెల్గొండ పాఠశాల వారు ముద్రించిన వాల్‌పోస్టర్‌ను డీఈవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ సమిష్టిగా కృషి చేస్తేనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు, జడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీఎస్ హెడ్మాస్టర్ దశరథ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని ఆదరించాలి

- ప్రశ్నించే గొంతుక వినోద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ
- మన్నెగూడంలో ముమ్మర ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న తుల ఉమ, బీఆర్ఎస్ నాయకులు

మేడిపల్లి, ఏప్రిల్ 18: పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకైన బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ ప్రజలకు పిలుపునిచ్చారు. భీమారం మండలం మన్నెగూడెంలో గురువారం జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు చెన్నమనేని రవీందర్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, మాజీ సర్పంచులు కాచర్ల సురేశ్, నాంచారి స్వప్న, రాజేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండా కిషన్, బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ దురిశెట్టి లక్ష్మణ్ కుమార్, నాయకులు చెన్నమనేని శ్రవణ్ రావు, ప్రశాంత్, ప్రదీప్, పాల్గొన్నారు.